## క్లుప్తంగా

### మహిళలకు వైద్య శిబిరం



మాట్లాడుతున్న మూర్తిబాబు

**పాలకొల్లు సెంట్రల్:** ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబంగా ఉండాలంటే ప్రతీ మహిళ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ తాళ్ల మూర్తిబాబు అన్నారు. శనివారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో భగ్గేశ్వరం, శివదేవుని చిక్కాల గ్రామాల్లో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. భగ్గేశ్వరం క్యాంపులో 115 మంది, శివదేవుని చిక్కాల క్యాంపులో 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వద్దే శేఖర్, ఈదర సత్యనారాయణ, మేడపాటి రమేష్,మాచవరపు గణేష్, పప్పొప్పుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగుల పట్టణ కమిటీ నియామకం



నూతన కమిటీ పత్రాన్ని అందుకుంటున్న సచివాలయ ఉద్యోగులు

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణ సచివాలయ ఉద్యోగులు నూతన కమిటీని నియమించుకున్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.విజయసారథి చేతులుమీదుగా నూతన కమిటీ పత్రాన్ని అందుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొరకోట శివసాయి తేజ, ఉపాధ్యక్షులుగా పెచ్చెట్టి కల్పన, కె.శ్రుతి కుమార్, ఎ.నరసింహస్వామి, నెల్లిపురి గౌతమి, పెద్దిరెడ్డి అనుష, సెక్రటరీగా దేవ శ్రీదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీరామ వెంకట హరికృష్ణ తదితరులను నియమించారు.

### ఆర్టీఐ పోస్టర్ ఆవిష్కరణ

**పెనుగొండ:** ఆర్టీఐ అసోషియేషన్ పోస్టరును పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. శనివారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండాబత్తుల ఆనందకుమార్, నియోజకవర్గ కన్వీనరు యల్లమెల్లి నాగేశ్వరరావు, పాలకొల్లు కన్వీనరు కొండేటి భూపతి తదితరులు పాల్గొన్నారు.

### వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

**నరసాపురం రూరల్:** మండలంలోని వేములదీవి కాపులకొడపలో వేంకటేశ్వర స్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

### నేటి నుంచి ముత్యాలమ్మ పునఃప్రతిష్టాపనోత్సవాలు

**నరసాపురం రూరల్:** మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ వారి ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 8న అమ్మవారి పూరిపాక, ఘటాలు దగ్ధం కావడంతో పండితుల సూచనల మేరకు పునః ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం గ్రామంలో పసుపు నీళ్ళతో సంప్రోక్షణ కార్యక్రమం జరుగుతుందని మరుసటి రోజు సోమవారం వేకువ జామున 5 గంటల నుండి ప్రముఖ సిద్ధాంతి అనీల్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో గ్రామంలోని 18 నివాస ప్రాంతాల భక్తులతో ప్రత్యేక హోమాలు, సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సంప్రోక్షణ అనంతరం అమ్మవారి నిట్రాడ స్థాపించే కార్యక్రమం జరుగుతుందని అనంతరం సుమారు 15 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

### చోరీ ముఠాపై అప్రమత్తంగా ఉండాలి

**ఆకివీడు:** మండలంలో చోరీ ముఠా సంచరించే ప్రమాదం ఉందని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.జగదీశ్వరరావు చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు వ్యక్తుల ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. తక్కువ ఛార్జీలు ఉన్న లాడ్జిల్లో వీరు దిగి ఆయా ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఇటీవల తణుకు ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే 112కి ఫోన్ చేయాలన్నారు.

# అధ్వానంగా మార్కెట్ యార్డు స్థలం

- సర్పాలకు, విష పురుగులకు నిలయంగా మారిన వైనం
- ఆక్రమణలతో మరింత ప్రమాదం

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణ నడిబొడ్డులో ఉన్న మార్కెటింగ్ యార్డు స్థలం అధ్వానంగా ఉండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మారుతి సెంటర్‌కు మధ్యలో అగ్రికల్చరల్ మార్కెటింగ్ యార్డు ఉంది. ఈ మార్కెటింగ్ యార్డుకు సంబంధించిన రోడ్డుకు ఓ పక్క కార్యాలయం, మరో పక్క గోడౌన్స్ ఉన్నాయి. గోడౌన్స్ ఉన్న ప్రాంతానికి సంబంధించి తూర్పు భాగంలో ప్రహరీ ఉంది. మునిసిపల్ రోడ్డుకు, యార్డు ప్రహరీకు మధ్యలో సుమారు 50 అడుగుల వెడల్పులో సుమారు ఓ 300 మీటర్ల పొడవున ఖాళీ స్థలం ఉంటుంది. అలాగే దక్షిణం భాగంలో బొర్రా వారి తోట కాలనీ సమీపంలో ఓ 200 మీటర్లు ఖాళీ జాగా ఉండడంతో ఆ కాలనీ వాసులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి ఫెన్సింగ్ వేసి మొక్కలు పెంచుతున్నారు. అంతేకాకుండా దాదాపు రెండు నెలలకోసారి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తుంటారు. కానీ తూర్పు భాగంలో ఉన్న ఖాళీ స్థలం మాత్రం అత్యంత అధ్వాన్నంగా ఉండడంతో స్థానిక ప్రజలు విష సర్పాలతో, దోమలు, విష పురుగులు, దుర్వాసనలతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.



మార్కెట్ యార్డు గోడౌన్ ప్రాంతంలో పడిపోయిన తూర్పు గోడలో కొంత భాగం

**కూలిన ప్రహరీ**

గోడౌన్ సముదాయానికి సంబంధించిన తూర్పు ప్రహరిగోడలో కొంత భాగం ఓ నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు పడిపోయింది. దీనివల్ల యార్డులోకి వెళ్లడానికి మార్గం ఏర్పడడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఈ ప్రహరీ నిర్మించడం లేదని, అలాగే ఖాళీ స్థలాన్ని బాగు చేయించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ స్థలం చెత్త చెదారం, కర్రలు, పని చేయని డెకరేషన్ మెటీరియల్స్‌తో అత్యంత అధ్వానంగా ఉంది. వర్షం వస్తే దోమలు, విష పురుగులు, దుర్వాసనలతో భరించలేకపోతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతం శుభ్రం చేయించి ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎదురుగా ఇంత స్థలం ఉండి కనీసం చిన్న పిల్లలకు దసరా సెలవుల్లో ఆట విడుపుకు కూడా ఉపయోగపడడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేగంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### వర్షం వస్తే అవస్థలే



మార్కెట్ యార్డు స్థలంలో వర్షం వస్తే నీరు నిల్వ ఉండిపోతుంది. దాని వల్ల దుర్వాసన ఎక్కువగా వస్తుంది. స్థానికులు వేసవిలో చల్లని గాలి కోసం ఇక్కడ కూర్చోవడానికి ఓ చెట్టు చుట్టూ దిమ్మ కట్టించారు. ఆ ప్రాంతంలో కర్రలు పడేయడంతో కూర్చునే వెసులుబాటు లేకుండా పోయింది. ఇంటిలో నుంచి దిగితే రోడ్డు వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఎదురుగా ఖాళీ స్థలంలో పిల్లలు ఆడుకుంటారంటే పాముల భయం వెంటాడుతుంది.

– కాకుల తాతాజీ, స్థానికుడు

### దోమలు, పాములతో ఇబ్బందులు



ఇంటి ఎదురుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దోమలు పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయి. మా ఇంట్లో వివాహ వేడుక ఉండడంతో కొంత స్థలాన్ని శుభ్రం చేయించుకున్నాం. అక్కడ పెళ్లి వేడుక జరుపుకుంటున్నాం. ఈ ప్రాంతంలో ఉన్న స్థానికులు చిన్న చిన్న వేడుకలు చేసుకోవడానికి ఈ స్థలం బాగా ఉపయోగపడుతుంది. దీనిని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల మొక్కలు పెరిగిపోయి విష సర్పాలతో భయంకరంగా ఉంటుంది.

– బొర్రా చినబాబు, స్థానికుడు



మొక్కలతో గుబురుగా ఉన్న మార్కెట్ యార్డు స్థలం



మసీదు పక్కన మట్టి గుట్టలతో మొక్కలు



చెట్టు చుట్టూ దిమ్మ కట్టినా దానిపై పడేసిన కలప

# రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**నరసాపురం:** మరో మూడు, నాలుగు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు వచ్చేస్తాయంటున్నారు... ఇప్పటికీ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు అధికారుల తప్పులు నిలదీయకుండా, వారిలో వారే వాదులాడుకుంటున్నారు. దీంతో తప్పులు చేస్తున్న అధికారులు నవ్వుకుంటూ తప్పించుకుంటున్నారంటూ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయం ఉన్న నాలుగు నెలలైనా ప్రజా సమస్యలపై చర్చించాలని వైకేఎస్ సూచించారు. కంబంపాటి చెరువు వద్ద చెత్త వేడానికి అక్కడున్న ప్రైవేట్ స్థలం నుంచి వాహనాలను సదరు ప్రైవేట్ స్థలా యజమానులకు తెలియజేయకుండా తీసుకెళ్లడం ఏంటి? అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యతన నిర్వహించారు. ముందుగా 29వవార్డులో ఉన్న కంభంపాటి చెరువు వద్ద ఇటీవల చెత్తను డంప్ చేసే ప్రయత్నం చేయడం, స్థానికులు అడ్డుకోవడంపై కౌన్సిలర్ అడిదల శ్యామల ప్రశ్నించారు. గోదావరి గట్టున చెత్త పోయవద్దని గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశిస్తే, వాటర్ బాడీ పక్కన అదీ దళితులు ఉన్న ప్రాంతంలో చెత్తను వేయడం ఏంటి? అని మండిపడ్డారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ



సమావేశంలో వాదించుకుంటున్న కౌన్సిలర్లు

**చెత్త డంపింగ్‌పై తీవ్ర వాగ్వివాదం**

కంభంపాటి చెరువు వద్ద చెత్తను డంప్ చేసే ప్రయత్నంపై సమావేశంలో వాడీవేడి చర్చ సాగింది. అడిదల శ్యామల, కేసరి గంగరాజు, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కోటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ కన్నా, జిల్లెళ్ల దిలీప్ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ప్రస్తుతం అక్కడ చెత్తను వేయడంలేదు కదా? అయినా దీనిపై వాదనలు ఎందుకని చైర్‌పర్సన్ పదే పదే చెప్పినా సభ్యులు వినలేదు. చివరకు చైర్‌పర్సన్ సమావేశాన్ని వాయిదా వేస్తానని పలు బెదిరించినా తీరుమారలేదు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. అక్కడున్న తమ సొంత స్థలాల నుంచి చెత్త ట్రాక్టర్లు తమకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఎలా తిప్పతారని వైఎస్సార్‌సీపీ సభ్యురాలు షేక్ యాకూబీబీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇప్పుడెందుకీ సమావేశం?**

అజెండాలో అభివృద్ధి పనులు ఏమీ పెట్టడంలేదని గత నెలలో సమావేశాన్ని వాయిదా వేసిన మీరు, ఇప్పుడు ఈ నెలలో కూడా అభివృద్ధి పని ఒక్కటి కూడా పెటకుండా సమావేశం ఎలా పెట్టారు? వన్నెంరెడ్డి శ్రీనివాస్ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. ఇది కౌన్సిల్ సమావేశంలా లేదని సంత మార్కెట్‌గా ఉందని, మీకు సమావేశం నడపడం రావడం లేదని, సభను కంట్రోల్‌లో పెట్టలేకపోతున్నారని శ్రీనివాస్ ఘాటు విమర్శలు చేయడంతో చైర్‌పర్సన్ అభ్యంతరం చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాదనలు జరిగాయి. అజెండాలో చేర్చిన ట్రాక్టర్ల రిపేరు అంశంపై వాడీవేడిగా చర్చ సాగింది. రూ.6 లక్షలు పెడితే కొత్త ట్రాక్టర్ వచ్చే క్రమంలో ఒక్కో ట్రాక్టర్ రిపేరుకు రూ.4.50 లక్షలు చొప్పున ఏకంగా ఒకేసారి 13 ట్రాక్టర్ల మరమ్మతులు చేయాలని నిర్ణయించడం దారుణమని కౌన్సిలర్ రావలి రామసీత ప్రశ్నించారు. ఇది అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి చేస్తున్న కుంభకోణమని వైఎస్సార్ సీపీ సభ్యులు మొత్తం ప్రశ్నించారు. తగ్గిన జీఎస్టీతో మళ్లీ అంచనాలు తయారు చేసి పెట్టాలని వాదించారు. దీంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, పతివాడ పద్మ, మల్లాడి శేషవేణి, ద్వారా గంగాభవానీ, గోరు రమాదేవి తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు.

# ముగిసిన హిందీ పక్షోత్సవాలు

**పాలకొల్లు సెంట్రల్:** భారత జాతీయ ఉద్యమంలో హిందీ ప్రధాన పాత్ర పోషించిందని ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాష పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ హిందీ భాష మాట్లాడగలిగితే దేశంలో ఏ ప్రాంతానికైనా వెళ్లవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ఈ కళాశాలలో చదువుకుని వివిధ కళాశాలల్లో హిందీ అధ్యాపకులుగా పని చేస్తున్న సుజాత, షేక్ లూదర్‌బాబులను ఘనంగా సత్కరించారు. వీరిద్దరూ మాట్లాడుతూ ఏఎస్ఎస్ఎం కళాశాలలో హిందీ అధ్యాపకుడు రమణ కుమార్ ఇచ్చిన ప్రోత్సాహంతో హిందీపై మరింత మక్కువ పెరిగిందన్నారు.



హిందీ అధ్యాపకురాలును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

కార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, రమణ కుమార్, హిందీ అధ్యాపకులు చిట్టూరి ఇంద్రయ్య (తణుకు), మంజువేణి (రాజమండ్రి) తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలి

**భీమవరం:** రాష్ట్రంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నా కానీ ప్రభుత్వం విద్యార్థులకు సరైన విద్య అందించడం లేదని ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐష గోష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గార్ల్స్ కన్వెన్షన్ సందర్భంగా భీమవరం టౌన్‌లో పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు 300 మంది విద్యార్థినులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టల్స్ నిర్మించాలని అన్ని పాఠశాలల్లో కళాశాలలో శానిటరీ ప్యాడ్స్‌ని ప్రభుత్వం అందించాలన్నారు.పె రిగిన ధరలకు అనుకూలంగా మెస్ చార్జెస్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్, రాష్ట్ర గార్ల్స్ కన్వీనర్ సిహెచ్ పావని, కో కన్వీనర్స్ జ్యోతి, చిన్ని, నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.




భీమవరంలో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థినులు

### చట్టాలపై అవగాహనతో ఉండాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**నరసాపురం రూరల్:** చట్టాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని నరసాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వైదాని నాగేశ్వరరావు అన్నారు. శనివారం నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలోని చిరంజీవి కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన నల్సా ×జాగృతి పథకంలో ఆయన వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ స్థాయిలో న్యాయ అవగాహన, సమాచార పారదర్శకత, ఈ పథకం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ వెన్న సూర్య ప్రకాష్, న్యాయ సేవా సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, ఎర్రంశెట్టి ఫణికర్ తదితరులు పాల్గొన్నారు.

### బస్టాండ్‌లో టాయిలెట్స్ ప్రారంభం

**పాలకొల్లు సెంట్రల్:** పాలకొల్లు పొట్టి శ్రీరాములు బస్స్ స్టేషన్ నందు నూతనంగా రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్స్‌ను ప్రారంభించారు. శనివారం విజయవాడ జోన్–2 ఈడీ విజయరత్నం, డీపీటీఓ వరప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో నరసాపురం డీఎం, సిబ్బంది పాల్గొన్నారు.

### సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**పెనుగొండ:** సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్ జీఎస్టీ వల్ల వినియోగదారులకు కలిగే సేవింగ్స్‌ను వివరించాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణ మోహన్ తెలిపారు. శనివారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అవగాహన కల్పించారు. సూపర్ జీఎస్టీ వలన వినియోగదారులు ప్రజలకు ముఖ్యంగా నిత్యావసరాలు, వ్యవసాయ పనిముట్లు, ఆరోగ్య భీమా వంటి వాటిలో తగ్గించిన జీఎస్టీ వలన కలిగే ప్రయోజనాలు పోస్టర్లు రూపంలో ఆవిష్కరించి, వారం రోజుల పాటు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, వెలుగు, ఆరోగ్య శాఖ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

### మహిళపై దాడి

**భీమవరం:** మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూరి నాగమణి ఆమె భర్త వెంకటేశ్వరరావు భీమవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలో నివసిస్తున్నారన్నారు. నాగమణి పోలియో వ్యాధితో బాధపడుతుందని, ఆమె భర్త వంట పనికి వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో 26వ తేది రాత్రి ఒక వ్యక్తి ఇంటి తలుపు తట్టి వంట చేయడానికి పిలుస్తున్నారని వెంకటేశ్వరరావును బయటకు పిలిచారు. ఆయన బయటకు వెళ్లగానే అజ్ఞాత వ్యక్తి లోపలికి ప్రవేశించి నాగమణి చేతుల, మెడపై గాయపరిచాడు. ఆమె కేకలు వేయడంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. భర్త వెంకటేశ్వరరావు నాగమణిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఏఎస్సై టి.దేవరాజు తెలిపారు.

# జగజ్జననీ నమోస్తుతే!




**పెనుగొండ:** అన్నపూర్ణాదేవిగా పెనుగొండ మహిషాసురమర్దని



**పెనుగొండ:** అన్నపూర్ణాదేవిగా మూలవిరాట్ వాసవీ మాత



**నరసాపురం:** స్కందమాతాదేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ



**పెనుగొండ:** లలితాత్రిపుర సుందరిగా మరకత శిల వాసవీ మాత



**పాలకొల్లు సెంట్రల్:** ఆర్యవైశ్య కల్యాణ మండపంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ



**పాలకొల్లు సెంట్రల్:** ఆకట్టుకున్న లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ



**యలమంచిలి:** అడవిపాలెంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



**నరసాపురం రూరల్:** చామకూరిపాలెంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**నరసాపురం:** దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద 41వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారు స్కందమాతాదేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణస్వామినాయుడు, గునిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి రామకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**యలమంచిలిలో..**

**యలమంచిలి:** అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనక దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద శనివారం గ్రామానికి చెందిన చిట్టూరి దుర్గాప్రసాద్, లక్ష్మీ పెద్దింట్లు దంపతులచే విఘ్నేశ్వర పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు కూడా పాల్గొన్నారు. వీరందరితో అర్చకులు పితాని పాణి పూజ చేయించారు. విజయదశమి కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పెనుగొండలో..**

**పెనుగొండ:** శరన్నవరాత్రులు ఐదో రోజు శనివారం అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని, మూలవిరాట్ వాసవీ మాతలను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతను లలిత త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వడలి, సిద్ధాంతం, ఆచంట, పెదమల్లం, కోడేరు, వల్లూరుల్లోనూ అమ్మవార్లను అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణ చేశారు. శనివారం ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చనలు చేశారు. రాత్రికి ఆలయంలో అలంకరించిన లలిత త్రిపుర సుందరీదేవి తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక చినగోపురం వీధిలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణ చేశారు. స్థానిక యడ్లబజారు సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని కనకదుర్గమ్మకు కుంకుమ పూజలు చేశారు.

**నరసాపురం మండలంలో..**

**నరసాపురం రూరల్:** నియోజకవర్గంలోని మొగల్తూరు, నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి మండపాల్లో అమ్మవార్లను రోజుకో అలంకరణలో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం చామకూరిపాలెంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన యాండ్ర శ్రీనివాసు, కనకదుర్గా దంపతులు, గుత్తుల హనుమంతు, అనంత లక్ష్మి, బొక్కా గణపతి, కవురు శివ తదితరులు పాల్గొన్నారు.